క్లుప్తంగా

మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గం


కరణం భాను

సామర్లకోట: వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరణం భాను మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో రౌడీ పాలన సాగుతోందని దుయ్యబట్టారు. రెడ్‌బుక్ పాలనలో కక్ష సాధింపుగా వైఎస్సార్ సీపీ నేతలను అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర నాయకులను అరెస్టు చేసి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయాందోళనకు గురి చేయవచ్చనే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అరాచక పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లో ఉన్నాయని హెచ్చరించారు.

ఆర్‌బీ పట్నం సొసైటీ చైర్మన్‌గా పెనుమర్తి

పెద్దాపురం: మండలంలోని రాయభూపాలపట్నం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పెనుమర్తి దొరబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

సీఐ కృష్ణభగవాన్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: మండల పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచుతామని సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆయన సామర్లకోట పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల తల్లిదండ్రులను పిలిపించి, ఎవరిపై ఎన్ని కేసులున్నాయో వివరించారు.

24న మదుగులమ్మ జాతర

సామర్లకోట: పంచారామ క్షేత్రం సమీపంలో వేంచేసి ఉన్న మదుగులమ్మ అమ్మవారి జాతర ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త వలూరి దొరబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం ఊరేగింపుగా గాంధీచౌక్ నుంచి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సొసైటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

సామర్లకోట: కొత్తగా స్థానిక ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడిగా పైబ్బి శ్రీనివాసరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు నీలమ్మ చెరువు గట్టుపై తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొసైటీ సొంత భవనాన్ని నిర్మించారు. దాంతో తిరిగి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. సొసైటీ డైరెక్టర్లుగా ఆదపు రెడ్డి కృష్ణారావు, తుమ్మల శ్రీనివాసులు ఎంపికయ్యారు.

ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడిగా కుసుమంచి

సామర్లకోట: మండల ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఆదివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి మందిరంలో జరిగిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో ఎన్నికైంది. అధ్యక్షుడిగా కుసుమంచి శేషగిరిరావు, ఉపాధ్యక్షునిగా జోన్నాడ సందీప్‌కుమార్, కార్యదర్శిగా సంకా వీరవెంకట కామేశ్వరగుప్తా, సహాయ కార్యదర్శిగా బచ్చు వీవీఎల్ సోమేశ్వరరావు, కోశాధికారిగా పలుకూరి శ్రీనివాసులు, మరో 15 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు. వీరితో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామసత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కుసుమంచి శేషగిరిరావు అధ్యక్షత వహించగా, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు వెలగా వెంకటనగేష్, మట్టే శ్రీను, కార్యదర్శి యక్కల ప్రసాదరావు, జిల్లా జోన్ చైర్మన్ ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్, పట్టణ ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు కంటకం త్రిమూర్తులు, అధ్యక్షుడు కటకం సతీష్, ఉపాధ్యక్షులు మట్టపలిల వెంకటేశ్వరరావు, కంచర్ల సాయిబాబు, కార్యదర్శి కంచర్ల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి గ్రంధి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కారుమూరి పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను, ముఖ్యఅతిథులను సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఆదివారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీఎంపీ వైద్యుడు కుమార్ యాదవ్ బీపీ పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎముకల పటుత్వానికి వృద్ధులు కొద్దిసేపు ఎండలో ఉండాలని, తద్వారా విటమిన్-డి లభిస్తుందన్నారు.

వదలని ప్లాస్టిక్


ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

- అమలు కాని నిషేధం
- ప్రచారానికే పరిమితం
- తూతూమంత్రంగా అధికారుల చర్యలు
- విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్రజలు
- అనర్థమని తెలిసినా విడనాడని వైనం

సామర్లకోట: విక్రమార్కుడి భుజాన ఉన్న బేతాళుడు అప్పుడప్పుడూ విడిచిపెడతాడేమో కానీ.. మహమ్మారిలా పరిణమించిన ప్లాస్టిక్ మాత్రం సమాజానికి జిడ్డులా అతుక్కుపోయింది. ప్లాస్టిక్ వాడకంపై కఠిన చట్టాలున్నా.. నిషేధమంతా కేవలం ప్రచారానికే పరిమితమైంది. కొన్నేళ్లుగా ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం చేస్తున్నా.. దానిని పూర్తిగా అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. మొక్కుబడిగా ప్రచారాలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలూ లేకపోలేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం మాట పక్కనపెడితే.. ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు, మార్కెట్‌లో విక్రయిస్తున్న బడా వ్యాపారులపై పాలకులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం జరుగుతున్న సమయంలో అధికారులు షాపులపై దాడులు చేసి, వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకుంటున్నారు. హోల్‌సేల్ వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు, వారిపై కేసులు నమోదు చేస్తే.. తయారీ కంపెనీల నుంచి ప్లాస్టిక్ కవర్ల కొనుగోళ్లకు బ్రేక్ పడుతుందనే వాదనలూ ఉన్నాయి. మార్కెట్లకు వెళ్లిన కొనుగోలుదారులు తమ వెంట సంచులు తీసుకెళ్లకపోవడంతో, వ్యాపారులు తమ సరకులను ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. వేడి టీ, కాఫీలతో పాటు, వేడిగా ఉన్న కూరలు, సాంబర్‌ను ప్రజలు ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకెళుతున్నారు.

ఆరోగ్యానికి హానికరం

పలు రసాయనాలతో ప్లాస్టిక్ కవర్లు తయారుచేయడం వల్ల వేడికి అవి కరిగి, ప్రజలు తినే, తాగే పానీయాలు, ఆహార పదార్థాలతో ఆరోగ్యానికి హాని కలుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు వినియోగం తర్వాత రోడ్లపై పడవేసే ప్లాస్టిక్ కవర్లు భూమిలో ఇంకకపోవడంతో పర్యావరణానికి హాని కలుగుతుంది. రోడ్లపై ఉన్న ప్లాస్టిక్ కవర్లను పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. అవి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. అనేక రకాల తినుబండరాలను తయారు చేసే సంస్థలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. వాటిపై తయారు తేదీ, సమయం ఉండవు. అధికారులకు మాత్రం చీమ కుట్టినట్టు కూడా ఉండదు.

పూర్వం ఇలా...

గతంలో మార్కెట్లకు వెళ్లే సమయంలో ప్రతిఒక్కరూ చేతిసంచులు, బుట్టలు వంటివి తీసుకెళ్లేవారు. వారు కొనుగోలు చేసిన సరకులను అందులో వేసుకొచ్చేవారు. ప్రస్తుతం ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో ఉండడంతో, చేతిసంచులు, బుట్టలను తీసుకెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. అలాగే శుభకార్యాల్లోను ప్లాస్టిక్ గ్లాసులు ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రస్తుతం వాటి స్థానంలో పేపరు గ్లాసులను వినియోగిస్తున్నారు. టీస్టాళ్లలో ప్లాస్టిక్ గ్లాసుల స్థానే పేపరు గ్లాసులు వినియోగంలోకి వచ్చాయి. అయితే టీస్టాళ్లలో వినియోగించే పేపరు గ్లాసుల్లోనూ.. లోపలి వైపు పల్చగా ఉండే పొర వంటిది కూడా ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వేడి వల్ల అది కరిగి, మనిషి కడుపులో చేరితే.. తీవ్రమైన వ్యాధులు కలిగే అవకాశం ఉందంటున్నారు. ఇటువంటి తరుణంలో ప్లాస్టిక్ వినియోగంలో ఎందుకు మార్పు రావడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


రోడ్డు పక్కన చెత్తలో ప్లాస్టిక్ కవర్లు


ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసిన తినుబండారాలు

జ్ఞాపకం వచ్చినప్పుడే..



అధికారులకు జ్ఞాపకం వచ్చినప్పుడే ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. నిరంతరం రెండు నెలల పాటు దీనిపై దృష్టి పెడితే ప్లాస్టిక్ వాడకాన్ని దూరం చేయవచ్చు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలి. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా దూరమైతే, కంపెనీల నుంచి తయారీ నిలిపి వేసే అవకాశం ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉండేలా మహిళా సంఘాల ద్వారా క్లాత్ కవర్లు తయారు చేయించి, మార్కెట్‌లోకి తీసుకురావాలి.

– పిట్టా సత్యనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారికి ప్రత్యామ్నాయంగా బయోడీగ్రేడబుల్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం. దీనిలో భాగంగా మెహర్ కాంప్లెక్స్‌లో ఓ స్టాల్ ఏర్పాటు చేయించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. మహిళా సంఘాల సభ్యులతో క్లాత్ కవర్లు తయారు చేయించి, మెప్మా అధికారుల సహకారంతో వాటిని మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

భర్త మరణించినా.. భార్యకు అందని పెన్షన్


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న హరిబాబు

సామర్లకోట: పెన్షన్ తీసుకుంటున్న భర్త చనిపోయినా, ఆ పెన్షన్ భార్యకు ఇవ్వడం లేదని 13వ వార్డు సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వితంతు పెన్షన్ల సమస్యపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశామని చెప్పారు. 13వ వార్డులో వృద్ధాప్య పెన్షన్లు తీసుకుంటున్న ఎనిమిది మంది చనిపోతే, వారి భార్యలకు పెన్షన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త చనిపోతే ఆ పెన్షన్‌ను వెంటనే భార్యకు బదలాయిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా, ఇప్పటి వరకు కొత్త పెన్షన్ల ఊసే లేదన్నారు. భర్త చనిపోయి, ఎటువంటి జీవనాధారం లేని వితంతువులకు వెంటనే పెన్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కౌన్సిలర్ పెండ్యాల అబ్బు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ తల్లి


ఆలయంలో బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: ఆషాఢ మాస మహోత్సవాల్లో భాగంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి సుమారు 1.50 లక్షల మంది భక్తులు తరలిచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లూ చేశారు. పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహించారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి వారం నిర్వహించే సంబరాల్లో భాగంగా కొత్తపేట, పాశిలి వీధి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

ఏడాది తిరక్కుండానే ప్రభుత్వంపై వ్యతిరేకత


సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు


దొరబాబును సత్కరిస్తున్న మండల కమిటీ నాయకులు

- బాబుకు మోసాలు కొత్త కాదు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం

సామర్లకోట: కూటమి ప్రభుత్వంపై ఏడాది తిరక్కుండానే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం వీకే రాయపురం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు తలారి దొరబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోతే వ్యతిరేకత తప్పదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడంతోనే గడప గడపకూ తిరిగిన సమయంలో ప్రతి కుటుంబంలోను ఆనందం కనిపించిందన్నారు. దాంతోనే ప్రతిపక్షాలు రోడ్లపైకి రాలేకపోయారని గుర్తుచేశారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో, ప్రజలతో పాటు అనేక పార్టీల రాజకీయ నాయకులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ప్రతి ఇంటికి చేరేలా వారి సంతకాలతో కూడిన బాండ్లను అందజేశారన్నారు. వాటిని అమలు చేయకపోవడంతోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ పోరాటాల ఫలితంగా కూటమి ప్రభుత్వం కొద్దిపాటి పథకాలనైనా అమలు చేస్తోందని చెప్పారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం కొత్తేమీ కాదని, ఆయనకు పవన్‌కల్యాణ్, బీజేపీ తోడవ్వడంతో ప్రజలు నమ్మి ఓట్లు వేశారన్నారు. ఈవీఎంల మోసం కూడా తమ ఓటమికి కారణమని వివరించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజలకిచ్చిన హామీలు, బాండ్‌లో పేర్కొన్న పథకాలు అమలు చేసేలా ప్రతి గ్రామంలో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెంచేలా ప్రతి గ్రామంలో పర్యటించి, ప్రజలకు మంచి చేసే వారితో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే మండల కమిటీల ఎంపిక పూర్తి కావడంతో, మిగిలిన వారికి జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పదవులు వచ్చే అవకాశం ఉన్నదని, త్వరలో వీటిని ప్రకటిస్తారని తెలిపారు.

వైఎస్సార్ సీపీకి అండగా కార్యకర్తలు

ఎన్నికల్లో ఓటమి చెందినా ప్రతి కార్యకర్త వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, దవులూరి దొరబాబును పెద్దాపురం ఎమ్మెల్యేగా చేసే వరకు కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు అత్తిలి సీతారామస్వామి మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ తన సంపాదన కోసమే రాజకీయాల్లోకి వచ్చారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి వినుకొండ విష్ణుచక్రం మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర, ధాన్యం సొమ్ము చెల్లించకుండా కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరిచిందని ఆరోపించారు.

దొరబాబుకు ఘన సత్కారం

పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో దవులూరి దొరబాబుకు ఘన సత్కారం జరిగింది. మండల అధ్యక్షునిగా ఎన్నికైన తలారి దొరబాబు, ఉపాధ్యక్షులు దమ్మాల లక్ష్మణరావు, నిడదవోలు రాంబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు, జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరణం భాను, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దవాఖానాలో డిష్యుం డిష్యుం

- జీజీహెచ్‌లో మితిమీరుతున్న కొట్లాటలు
- నాలుగు రోజుల వ్యవధిలో రెండు ఘటనలు
- క్షతగాత్రులపై ప్రత్యర్థుల దాడులు
- నియంత్రణలో పోలీసులు, ఆస్పత్రి వర్గాలు విఫలం



కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి

కాకినాడ క్రైం: ప్రసిద్ధి చెందిన కాకినాడ జీజీహెచ్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఘర్షణల్లో గాయాలపాలై.. వైద్యం కోసం వస్తున్న వ్యక్తులు, వారి ప్రత్యర్థుల కొట్లాటకు ఆస్పత్రి విభాగాలు, ఇక్కడి వార్డులు వేదికలవుతున్నాయి. అదుపుతప్పి, హద్దుమీరుతున్న ఇటువంటి హింసాత్మక ఘటనలు ఇతర రోగులకు సంకటంగా, సిబ్బందికి తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. వీరిని నియంత్రించడంలో అవుట్‌పోస్ట్ పోలీసులు సహా, ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది విఫలమవుతున్నారు. ఘర్షణలకు పాల్పడుతున్న వారిని నియంత్రించలేక తమ వల్ల కాదంటూ ఒక్కోసారి చేతులెత్తేస్తున్నారు. ఒక్కోసారి పోలీసులపైనా తిరగబడుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా ఘటనలు వారం రోజుల వ్యవధిలో రెండు చోటుచేసుకోవడం ఆస్పత్రిలో చర్చనీయాంశమైంది.

ఏం జరుగుతోంది?

కాకినాడ జీజీహెచ్‌లో అత్యవసర విభాగంలో ఎమ్మెల్సీ, నాన్ ఎమ్మెల్సీ వార్డులుంటాయి. ఎమ్మెల్సీ వార్డులో చికిత్స పొందుతున్న కొందరు రోగులు, వారి వైరివర్గాల వైఖరి చుట్టూ వివాదాలు రాజుకుంటాయి. క్షతగాత్రులు ఘర్షణలు, వ్యక్తిగత, వర్గ విబేధాలు, కొట్లాటలు, హత్యాయత్నాల ఘటనల్లో గాయాలపాలై ఇక్కడ చేరుతారు. ఆయా ఘటనల్లో ప్రత్యర్థులు క్షతగాత్రులతో ఆస్పత్రి వరకు వచ్చి ఇక్కడ రచ్చ చేస్తున్నారు.

ప్రతీకారేచ్ఛతో..

ఘర్షణ చోటు చేసుకున్న ప్రాంతాల్లో వ్యక్తి మరో వ్యక్తిపై చేసిన దాడికి ఇద్దరూ లేదా కనీసం ఒక్కరు గాయాలపాలవుతారు. ఈ ఘర్షణల్లో ఎక్కువ మంది జోక్యం చేసుకుంటే మరింత మంది గాయాలపాలయ్యే అవకాశం ఉంటుంది. అలా గాయాలపాలైన వారిని స్థానికులు లేదా బంధువులు ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఈ క్రమంలో క్షతగాత్రుడిపై ప్రతీకారేచ్ఛతో వైరి వర్గం వారిని ఆస్పత్రికి తరలించడంలో ఇబ్బందులకు గురి చేయడంతో పాటు, ఆస్పత్రికి చేరినా చికిత్సకు ఆటంకం కలిగించేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కనీస విచక్షణ మరిచి ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడుతున్నారు.

అవుట్ పోస్ట్‌లో సిబ్బంది కొరత

కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది కొరతతో బలహీనంగా ఉంది. నామమాత్రంగా ఉన్న పోలీసుల సంఖ్య ఆస్పత్రిలో చోటు చేసుకుంటున్న అవాంఛనీయ సంఘటనలను అదుపు చేయడంలో విఫలమవడానికి కారణమవుతోంది. 54 వార్డులు 3 వేల మంది ఓపీ, 2 వేల మంది ఐపీ రోగులతో నిత్యం కిటకిటలాడే కాకినాడ జీజీహెచ్‌లో రాష్ట్రంలో ఉన్న అతి పెద్ద ఆస్పత్రులలో ఒకటి. ఇటువంటి ఆస్పత్రిలో భద్రత పర్యవేక్షణ కోసం కనీసం ఎస్సై స్థాయి అధికారి పర్యవేక్షణ కొనసాగించాల్సి ఉండగా, పోలీసు ఉన్నతాధికారుల్లో ఈ మేరకు ఆలోచన కానరావడం లేదు. అంతే కాకుండా 1+3(ఏఎస్సై/హెచ్‌సీ+కానిస్టేబుళ్లు) చొప్పున రెండు షిఫ్టుల్లో ఎనిమిది గంటల చొప్పున మొత్తం 8 మంది సిబ్బందిని జీజీహెచ్‌లో భద్రత, ఎమ్మెల్సీ కేసుల కోసం నియమించాల్సి ఉంది. కేవలం ఐదుగురితోనే అవుట్‌పోస్ట్ నడిపిస్తూ మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవాంఛనీయ ఘటనలు, ఘర్షణల సందర్భాల్లో, అందుబాటులో ఉన్న ఒకరిద్దరు పోలీసులు వచ్చి అడ్డుకోవాల్సి వస్తోంది. మూక విన్యాసాల ముందు వీరి ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఆస్పత్రి సెక్యూరిటీ కూడా ఈ విషయంలో పూర్తిగా విఫలమైంది. ఘర్షణల నియంత్రణలో వీరు సమర్థతను చాటుకోలేకపోతున్నారు. ఇటువంటి తరుణంలో అవుట్‌పోస్ట్‌ను మరింత పటిష్టపరచాల్సి ఉంది.

వైద్యానికి అంతరాయం కలిగిస్తే..

రోగి వైద్య సేవలు పొంది, పూర్తి సాంత్వనతో జీవించే హక్కును కలిగి ఉంటాడు. ఈ హక్కుకు భంగం వాటిల్లినా, అలాగే హింసాత్మక చర్యలతో ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యుల విధులకు ఆటంకం కలిగించినా చట్టప్రకారం కఠిన శిక్షలున్నాయి. 2020 చట్ట సవరణను అనుసరించి మూడు నెలల నుంచి ఐదేళ్ల వరకు కారాగార శిక్ష, రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటాయి.

వారంలో రెండు ఘటనలు

కాకినాడ జీజీహెచ్‌లో వార్డులకు వచ్చి మరీ దాడి చేసిన ఘటనలు ఈ మధ్య కాలంలో రెండు చోటు చేసుకున్నాయి.

- పెదపూడి పీఎస్ పరిధిలోని రామేశ్వరంలో ఈ నెల పదిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు అక్కడికక్కడే కొట్టుకోగా, ఓ వర్గం వ్యక్తి ఆస్పత్రిలో చేరాడు. ఇతడిపై పుట్లేటి అర్జున్ అనే వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లోనే దాడికి పాల్పడ్డాడు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం ఉన్నతాధికారులకు చేరగా సతీష్‌పై కేసు నమోదైంది.
- కుటుంబ కలహాల నేపథ్యంలో కాకినాడ జగన్నాథపురానికి చెందిన గణేష్ అనే వ్యక్తి దారుణంగా ప్రవర్తించాడు. భార్యపై ఆమె చిన్నాన్నపై దాడి పాల్పడ్డాడు. వారు ఎమ్మెల్సీ చేయుంచుకుని చికిత్స పొందుతుండగా, గణేష్ ఆస్పత్రి వార్డులోకి వెళ్లి మరీ వారిద్దరిపై దాడికి పాల్పడ్డాడు.


కాకినాడ జీజీహెచ్ ఎమ్మెల్సీ వార్డులో కొట్లాట


ఆస్పత్రిలో కొట్లాటకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



ఆస్పత్రిలో కొట్లాటకు దిగిన వ్యక్తులను అడ్డుకుంటున్న ఏఎస్సై రవి

'యంగ్ మైండ్' సేవలు అభినందనీయం


అతిథులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

బాలాజీచెరువు: ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, సమాజానికి తనవంతు సేవ చేయాలనే ఉద్దేశంతో వాకాడ వెంకటరమణ(చిన్న) మాస్టారు యంగ్‌మైండ్ సంస్థను స్థాపించి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు అన్నారు. సంస్థ స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా తొలి వార్షికోత్సవాన్ని స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ, యువతలో స్ఫూర్తి నింపేందుకు యంగ్‌మైండ్ సంస్థ ఏడాది కాలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. మరో అతిథి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ, సుమారు రూ.20 లక్షలు సేకరించి, 80 శాతం కాలిన గాయాలతో ఉన్న బాలికకు వైద్యం చేయించి, తిరిగి పాఠశాలకు వెళ్లేలా కృషి చేసిన మహనీయుడు వెంకటరమణ అని కొనియాడారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, కుట్టు మెషీన్లు, విద్యార్థులకు సైకిళ్లు, పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు అందజేశారు. అనంతరం సూర్య ఐకేర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, డాక్టర్ నితిన్, సందీప్, ఎంఈఓ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధనమహాలక్ష్మి తల్లికి సారె సమర్పణ

కరప: కొంగోడు గ్రామ దేవత ధనమహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం మహిళలు చీర, సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని ఆడపడచులు, మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, చలివిడి, వడపప్పు, వివిధ రకాల స్వీట్లు ఉంచిన బిందెలను తలపై ఉంచుకుని, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో బిందెలు, అరటిపండ్ల గెలలతో, పట్టు చీర కావిడితో గ్రామంలో ఊరేగారు. అనంతరం అమ్మవారి గుడి వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.